చిచ్చు పెట్టిన ఇసుక వివాదం

- శెట్లూర్‌లో దాడులు చేసుకున్న ఇరువర్గాలు
- పోలీసులు, గ్రామ పెద్దల ప్రవేశంతో సద్దుమణిగిన వివాదం



బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఇసుక ట్రాక్టర్లు (ఫైల్)



శెట్లూర్ గ్రామ శివారులోని ఇసుక డంపులు (ఫైల్)

బిచ్కుంద(జుక్కల్): ప్రశాంత వాతావరణం ఉండే శెట్లూర్ గ్రామంలో ప్రజల మధ్య ఇసుక వివాదం చిచ్చుపెట్టింది. గ్రామానికి ఆనుకొని మంజీరా ప్రవహిస్తోంది. ప్రతి రైతు రెండు, మూడు వ్యవసాయ బోర్ల ద్వారా పంటలు సాగుచేస్తున్నారు. అక్రమ సంపాదనకు కొందరు గ్రామంలో ఇసుక వ్యాపారులుగా అవతారమెత్తి ఇసుక అక్రమ దందా జోరుగా కొనసాగిస్తున్నారు. ఇసుక కోసం గ్రామంలో ప్రజలు రెండు వర్గాలుగా విడిపోయి రెండు రోజుల కింద ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. మంజీరా నది ప్రవాహం తగ్గడంతో రెవెన్యూ అధికారులు ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇసుక అనుమతులు ఇవ్వడానికి శెట్లూర్‌కు వెళ్లారు. పర్మిట్లు ఇస్తున్న సమయంలో వర్గాలుగా విడిపోయి ఉన్న ఇసుక వ్యాపారులు.. ఇసుక పర్మిట్ ముందు నా వర్గానికి ఇవ్వాలంటూ ఒకరినొకరు తోచుకుంటూ చొక్కాలు పట్టుకొని దాడులు చేసుకున్నారు. సుమారు 7 వందల ఓటర్లున్న గ్రామంలో ఇసుక రవాణా కోసం 50 పైన ట్రాక్టర్లు ఉన్నాయి. యాజమానులు, డ్రైవర్లు కర్రలతో కొట్టుకోవడానికి సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని గమనించిన రెవెన్యూ అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకునట్లు తెలిసింది. గ్రామ పెద్దలు జోక్యం చేసుకొని ఇరువర్గాలను సముదాయించి కేసులు కాకుండా నచ్చజెప్పారు.

పోలీసులకు పట్టిస్తున్నారని..

ఇసుక దందాకు అడ్డుపడకుండా కొందరు వ్యాపారులు అధికారులకు మామూళ్లు మాట్లాడుకొని రాత్రి సమయంలో ఇసుక తరలిస్తున్నారు. మరి కొందరు గ్రామ శివారులో డంపులు వేసి టిప్పర్లలో ఇసుక తరలిస్తున్నారు. మామూళ్లు ఇవ్వకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను అధికారులకు సమాచారం ఇచ్చి పట్టిస్తున్నారనే ఆగ్రహంతో చాలా సార్లు కొట్టుకున్న ఘటనలున్నాయి. గ్రామంలో రెండు వర్గాలుగా ప్రజలు విడిపోయారు. ఈ వివాదం సంవత్సరం నుంచి కొనసాగుతుందని గ్రామస్తులు అంటున్నారు. నెల రోజుల నుంచి మంజీరాలో వరద నిండుగా ప్రవహిస్తోంది. ఇసుక తరలింపునకు అవకాశం లేకపోవడంతో ఇసుకకు డిమాండ్ పెరిగింది. వారం రోజుల నుంచి వరద తగ్గడంతో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తరలించడానికి అధికారులు శుక్రవారం పర్మిట్లు జారీ చేయగా శెట్లూర్ గ్రామంలో మరోసారి ఇసుక వివాదం రాజుకుంది. ఇసుక గొడవలు శెట్లూర్ గ్రామంలోనే కాకుండా హజ్గుల్, పుల్కల్, ఖద్గాంలలో కూడా జరుగుతూనే ఉన్నాయి. ఇసుక దందాపై ఉన్నతాధికారులతో పైస్థాయి ప్రజాప్రతినిధులు కూడా ఓ కన్నేసి ఉంచాలని స్థానిక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అర్ధంతరంగా నిలిచిన 'జీపీ' పనులు



ఆరేపల్లిలో మధ్యలో నిలిచిన జీపీ భవన నిర్మాణం



నడిమితండాలో..

- అంగన్‌వాడీ, అద్దె భవనాల్లో పలు పంచాయతీల నిర్వహణ
- నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికుల డిమాండ్

రాజంపేట: ఆరేపల్లి, నడిమితండా గ్రామాలలో పంచాయతీ భవన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఆరేపల్లిలో పంచాయతీ నిర్వహణ అంగన్‌వాడీలో కొనసాగుతుంది. అంగన్‌వాడీ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో సిబ్బంది భయాందోళన మధ్య పని చేయవలసిన దుస్థితి ఏర్పడింది.

బిల్లుల మంజూరులో జాప్యం..

2019లో అప్పటి ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసి.. ఆరేపల్లి, నడిమితండా, సిద్దాపూర్‌లలో జీపీ భవన నిర్మాణాలకు అనుమతులు జారీ చేసింది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద ఒక్కో గ్రామ పంచాయతీ నిర్మాణానికి రూ.20 లక్షలు కేటాయించింది. సిద్దాపూర్ గ్రామ పంచాయతీ భవనం మాత్రమే పూర్తి కాగా ఆరేపల్లి, నడిమితండాలలో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. శేర్‌శంకర్ తండా, గుడితండా, ఎల్లారెడ్డిపల్లి తండా, ఎల్లాపూర్ తండాల జీపీలకు ఇప్పటికీ శాశ్వత భవనాలు లేవు. వీటికి శాశ్వత భవనాలు లేకపోవడంతో గ్రామ పంచాయతీల నిర్వహణను అద్దె భవనాలు, అంగన్‌వాడీ భవనాల్లో చేపడుతున్నారు. వీటికి ప్రభుత్వం ఎప్పుడు నిధులు మంజూరు చేస్తుందో వేచి చూడాలి. ఆరేపల్లి, నడిమితండాలో జీపీ భవన పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. సరైన సమయంలో బిల్లులు రావడం లేదని, అందుకే పనుల్లో ఆలస్యం జరుగుతోందని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి సకాలంలో బిల్లులు అందించి త్వరితగతిన నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వరద నీరు కాదు.. మురుగు నీరే



రాజంపేట: తలమడ్ల గ్రామ పరిధిలో ఇటీవల నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిలో మురుగు నీరు ప్రవహిస్తోంది. దుర్వాసన వెదజల్లుతోంది. అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం గ్రామానికి ఆనుకొని ఉండటంతో గ్రామ మురుగు నీటి కాలువ అండర్ బ్రిడ్జిలోకి ప్రవహించి ఇలాంటి దుస్థితి నెలకొంది. దీంతో సమీప ప్రాంతంలోని కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ఇలాంటి పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు.

రోడ్డుకు అడ్డంగా ముళ్ల పొదలు



మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని కుర్లా, ధోతి, మల్లాపూర్ గ్రామాలకు వెళ్లే రహదారులపై అడ్డంగా ముళ్లపొదలు పెరిగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు అడ్డుగా ఉన్న ముళ్ల పొదలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

కల్లు గీత వృత్తిని ప్రోత్సహించాలి

- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ



మాట్లాడుతున్న వెంకట రమణ

కామారెడ్డి టౌన్: స్వదేశీ వస్తువులు వాడాలని చెబుతున్న ప్రభుత్వాలు కల్లుగీత వృత్తిని ఎందుకు ప్రోత్సహించడం లేదని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ ప్రశ్నించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మాట్లాడారు. దేశీయ వస్తువులనే వాడండని ప్రధాని మోదీ చెబుతున్నారని ప్రకృతి పానీయం నీరా, కల్లును కూడా తాగాలని ప్రోత్సహించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గీత కార్మికుల సంక్షేమానికి పథకాలను ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి సిరిపురం రమేష్ మాట్లాడుతూ ..గీత కార్మికులకు ఈత చెట్ల పెంపకానికి సొసైటీకి ఐదు ఎకరాల చొప్పున భూమి ఇచ్చి, హైబ్రిడ్ తాటి ఈత వనాలు ఇవ్వాలన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలో నీరా తాటి ఈత ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభించాలని, ప్రతి జిల్లాలో ఈ పరిశ్రమలు ఏర్పాటు చేసి కల్లుగీత కార్మికులను ఆదుకోవాలన్నారు. రైతు బీమా తరహాలోనే గీత కార్మికులందరికీ గీతన్న బీమాను అమలు చేయాలని అన్నారు. ఈనెల 19న కల్లు గీత కార్మిక సంఘం 68వ వార్షికోత్సవాలను మండలాల్లో నిర్వహించి, నవంబర్ 11న జిల్లా మహాసభ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకట్ గౌడ్, ఉపాధ్యక్షుడు యాదగిరి గౌడ్, నాయకులు రవీందర్ గౌడ్, శంకర్‌గౌడ్, మోహన్ గౌడ్, రమేష్ గౌడ్, రాజా గౌడ్ తదితరులున్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు

- ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్



బాన్సువాడ: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో సీసీ డ్రెయినేజీలు, రోడ్ల నిర్మాణానికి రూ. 15 కోట్లు మంజూరయ్యాయని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ తెలిపారు. శనివారం పట్టణంలోని ఆయా కాలనీల్లో నూతనంగా నిర్మించే డ్రెయినేజీలు, రోడ్లను ఆయన పరిశీలించారు. పనులు నాణ్యతతో జరిగేలా స్థానిక నాయకులు దగ్గరుండి పనులను పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు ఎజాస్, నార్ల సురేష్, దాసరి శ్రీనివాస్ తదితరులున్నారు.

పెద్ద పోచమ్మ ఆలయంలో హోమం



నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో రెండు రోజులుగా సాగుతున్న గ్రామ దేవతల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా శనివారం హోమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామ ప్రజలు నియమ నిష్ఠలతో ప్రతి రోజూ జరుగుతున్న ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. నేడు గ్రామ దేవత విగ్రహాల ప్రతిష్ఠాపన, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామ పెద్దలు అరిగె సాయిలు, కంది మల్లేష్, కూని సాయాగౌడ్, విఠల్, అయినాల లింగం తదితరులు పాల్గొన్నారు.

భవానిపేట తండా బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

మాచారెడ్డి: పాల్వంచ మండలం భవానిపేట తండా బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా గుగులోతు శ్రీనివాస్ నాయక్, ప్రధానకార్యదర్శిగా రాజేందర్‌ను నియమించారు. ఈ మేరకు పాల్వంచ మండల అధ్యక్షుడు రాజగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని ఆయన కోరారు.

ప్రమాదకర గుంతల పూడ్చివేత



ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను మొరంతో పూడ్చుతున్న నేతలు

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ శనివారం మట్టితో పూడ్చివేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు సుల్తాన్ నగర్ గ్రామ శివారులో ప్రధాన రహదారి తారు కొట్టుకుపోయి గుంతలుగుంతలుగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులకు పలు మార్లు చెప్పినా వారు పట్టించుకోకపోవడంతో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ స్పందించి మొరం తెప్పించి గుంతలను పూడ్చి వేయించారు.

వాంబే కాలనీలో రోడ్డుకు మరమ్మతులు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి పట్టణంలోని వాంబే కాలనీలోని మజీద్ రోడ్డు నుంచి డ్రైవర్ కాలనీ రోడ్డు వరకు సీసీ రోడ్డు పనులు మంజూరుకాగా ట్రాక్టర్‌తో శనివారం చదును పనులను ప్రారంభించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సీసీ రోడ్డుకు నిధులు మంజూరు చేసినట్లు 20 వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి క్లెం సత్యం తెలిపారు. నేతలు ఎండీ రఫీక్, శ్రీకర్, హమీద్, జాఫర్, యాదగిరి, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా చాముండేశ్వరి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన మహిళలు



భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయ 54వ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు జరిపించారు. పల్లకిసేవ చేపట్టారు. అనంతరం మహిళలు ఒడి బియ్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిద్దారెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ ఐరేని నర్సయ్య, మాజీ జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, మాజీ ఎంపీపీ కానుగంటి శారద, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి, ఆలయ ఈవో ప్రభు, కమిటి డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళమిచ్చిన భక్తుడికి సన్మానం

ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నదానం చేసిన కామారెడ్డికి చెందిన రేఖ రాజేష్ కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. 500 మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆశాల సంక్షేమానికి కృషి చేయాలి



జిల్లా కేంద్రంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న జయలక్ష్మి

కామారెడ్డి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా కార్యకర్తల సంక్షేమానికి కృషి చేయాలని వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన యూనియన్ నాలుగో మహాసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు అమలుతో పాటు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఆశాలకు పనిభారం, అధికారుల వేధింపులు మానుకోవాలన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక

సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షురాలిగా ఇందిర, కార్యదర్శిగా రాజశ్రీ, కోశాధికారిగా మమత, ఉపాధ్యక్షురాలిగా మంజుల, నాగమణి, అనిత, సహాయ కార్యదర్శులుగా విజయ, లావణ్య, పల్లవి, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: స్థానిక సంస్థల ఎన్నికలకు నియోజకవర్గంలో కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని రాజారెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన నియోజకవర్గ బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు కోర్టు తీర్పు కారణంగా వాయిదా పడ్డప్పటికీ ఏ క్షణంలో అయినా మళ్లీ నోటిఫికేషన్ రావచ్చన్నారు. ఇందు కోసం ప్రతి కార్యకర్త ఎన్నికలకు సిద్ధంగా ఉండి బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. నియోజకవర్గంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు ఏ రిజర్వేషన్ వచ్చినా పోటీకి అభ్యర్థులున్నారని చెప్పారు. గ్రామాలలో కార్యకర్తల సమావేశం నిర్వహించి పోటీ చేసే అభ్యర్థులను తీర్మానం చేసి ప్రతిపాదించాలని కోరారు. పోటీ చేసే అభ్యర్థులు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో బీజేపీ గెలుపు లక్ష్యంగా ముందుకెళ్లాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, నేతలు విపుల్, లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

సమాచారం..

నేడు శ్రీసత్యసాయి వంద భజనమాల

కామారెడ్డి అర్బన్: శ్రీసత్యసాయి యువజన విభాగం ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్పనగర్‌లోని సత్యసాయి మందిరంలో 100 భజనలతో భజనమాల కార్యక్రమం, నగర సంకీర్తన నిర్వహిస్తున్నట్లు సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. భజనమాల ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగుతుందని, మధ్యాహ్నం భోజన ప్రసాదం ఉంటుందన్నారు.

18న జీడిమెట్లలో మెగా రక్తదాన శిబిరం

కామారెడ్డి అర్బన్: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఈ నెల 18న ఉదయం 10 గంటలకు జీడిమెట్ల పోలీసు స్టేషన్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు కామారెడ్డి రక్తదాతల సమూహం వ్యవస్థాపకులు, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ బాలు తెలిపారు. జీడిమెట్ల పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ సహకారంతో ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు బాలు పేర్కొన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారులకు ప్రతి 15 రోజులకు యూనిట్ రక్తం అవసరం ఉంటుందన్నారు.

క్లుప్తంగా

గురుకుల పాఠశాలలో బాలికా దినోత్సవం



బాన్సువాడ రూరల్: కొయ్యగుట్టలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్ మాట్లాడుతూ.. నేటికి కూడా కొన్నిచోట్ల బాలికల పట్ల, వారి విద్య, ఆరోగ్యం పట్ల వివక్షత చూపుతుండటం బాధాకరమన్నారు. భారత దేశం అభివృద్ధి పథంలో పయనించాలంటే బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రిన్సిపల్ లక్ష్మీబాయి, మంజుల, శ్రీవాణి, శివరాజులు, సుజాత, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



కామారెడ్డి టౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన వరద బాధితులకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి టి. నాగరాణి చేతుల మీదుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని జీవదాన్ ఆస్పత్రిలో నెస్లే ఇండియా లిమిటెడ్, న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రతినిధులు ఎండీ. వాసీన్, రవికుమార్, ప్రవీణ్, రాజు తదితరులున్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



ఎల్లారెడ్డిరూరల్: కాలనీలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై మహేష్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డి మదర్సాలో సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. సీసీ కెమెరాలు వంద మంది పోలీసులతో సమానమని అన్నారు. సీసీ కెమెరాలు ఉండడం వల్ల చోరీలు జరిగేందుకు ఆస్కారం తక్కువగా ఉంటుందన్నారు. నేతలు ఎజాజ్ అహ్మద్ తదితరులున్నారు.

బీజేపీలో చేరిక



భిక్కనూరు: తిప్పాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ) ఉపాధ్యక్షుడు నారిగళ్ల రాజు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి శనివారం బీజేపీలో చేరారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సమక్షంలో రాజు తన అనుచరులతో కలిసి బీజేపీ చేరారు. ఆయనకు ఎమ్మెల్యే కేవీఆర్ బీజేపీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేవీఆర్ మాట్లాడుతూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అన్ని స్థానాలకు పోటీ చేసి విజయ దుందుభి మోగించాలన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు వారిని స్థానిక సంస్థల ఎన్నికల్లో భూస్థాపితం చేయడం తథ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పైడి రాజశేఖర్‌రెడ్డి, బస్వారెడ్డి, బాపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సోయా కోతల్లో రైతులు బిజీ



మద్నూర్(జుక్కల్): మండల పరిధిలో సోయాబీన్ పంట కోత దశకు చేరుకోవడంతో రైతులు బిజీగా మారారు. కూలీలకు విపరీతంగా డిమాండ్ ఏర్పడడంతో పాటు వాతావరణం బాగుండడంతో రైతులు ఎలాగైనా సోయా పంట ఇంటికి తెచ్చుకోవాలని ఆరాటపడుతున్నారు. వర్షాలు కురిస్తే ఉన్న పంట కూడా చేతికందకుండా పోతుందని, రైతులు పక్క మండలాలైన బిచ్కుంద, జుక్కల్ నుంచి కూలీలను మాట్లాడుకొని సోయా కోతలు చేపిస్తున్నారు. ఎకరా సోయా పంట కోసి కుప్ప వేయడానికి రూ.4,500 చెల్లిస్తున్నామని, అదనంగా కూలీలకు ఆటో చార్జీలు సైతం ఇవ్వాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నా రు. ప్రభుత్వం సోయా పంట కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

సంక్షిప్తం

రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు, దుప్పట్ల పంపిణీ



భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు, దుప్పట్లను శనివారం భిక్కనూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పురాం రాజమౌళి గుప్తా పంపిణీ చేశారు. ప్రస్తుతం జ్వరాల సీజన్ విపరీతంగా ఉన్నందున రోగులకు అవసరమైన వాటిని స్వచ్ఛందంగా అందజేసినట్లు తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ సతీష్ తదితరులు ఉన్నారు.

అపరిచితుల వద్ద బంగారం కొనొద్దు

ఎల్లారెడ్డి: అపరిచితుల వద్ద బంగారం కొనుగోలు చేయవద్దని ఎస్సై మహేష్ శనివారం సూచించారు. బంగారం వ్యాపారులు అపరిచిత వ్యక్తుల వద్ద బంగారం కొనుగోలు చేసి మోసపోవద్దని అన్నారు. దొంగలు బంగారం విక్రయిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

వాహనాల తనిఖీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముస్తాపూర్ గ్రామ శివారులో శనివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలు తనిఖీ చేసి హెల్మెట్, సీటు బెల్టు ధరించని వారికి, ధ్రువపత్రాలు సక్రమంగా లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. అలాగే పెండింగ్ చలాన్లు వసూలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్సై నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్న సంఘాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలలో గల చిన్న సంఘాలు అన్ని రకాలా అభివృద్ధి చెందాలని ఐకేపీ సీసీ రాజయ్య అన్నారు. చిట్యాలలో శనివారం గ్రామ సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆర్థిక లావాదేవీలపై చర్చించారు. ప్రతి నెలా 10 లోపు స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు చెల్లించాలని సూచించారు. వీవోఏ రుక్మిణి, ఎస్ఎస్ఏఎం సౌజన్య, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.